క్లుప్తంగా

అన్నసమారాధన

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలో వేంచేసిన పురాతన పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని గ్రామస్తుల సహకారంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



లోకేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థి జేఎస్ఎస్‌వీ లోకేష్ నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న లోకేష్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ నెల 17 నుంచి 20 వరకూ పుదుచ్చేరి, చెన్నైలో జరిగే పోటీల్లో లోకేష్ పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎ.రమేష్, డీన్లు, అధ్యాపకులు లోకేష్‌కు అభినందనలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మాధన భద్రం ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ నాయకులు సాపిశెట్టి చిన్నా, బెక్కం చంద్రగిరి, ఎంపీటీసీ నందెపు చిన్న, బూర్తి నాని, పేకేటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరకుల నాణ్యతపై తనిఖీలు

అన్నవరం: రత్నగిరిపై సత్యనారాయణస్వామి ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యి, గోధుమలు, పంచదార, యాలకులు, అన్నదానం విభాగంలో ఉపయోగించే బియ్యం, నూనె, పప్పుల నాణ్యతపై ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఫుడ్ అండ్ సేఫ్టీ జిల్లా అదనపు ఆహార తనిఖీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆయన శనివారం దేవస్థానానికి వచ్చి వివిధ దినుసుల శాంపిల్స్‌ను తనిఖీ నిమిత్తం తీసుకువెళ్లారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించే నాలుగు సీసీ రోడ్లుకు శనివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.80 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. సర్పంచ్ పురంశెట్టి శివాజీ, నాయకులు అడపా భరత్‌బాబు, జనపరెడ్డి బాబు, వల్లేపల్లి సత్యన్నారాయణపాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుల అరెస్టు

కిర్లంపూడి/జగ్గంపేట: మండలంలోని గెద్దనాపల్లిలో అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై జి.సతీష్ తెలిపారు. అతని నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో బెల్ట్ షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్టు జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

గోకవరం: బైక్‌పై ప్రయాణించే వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని గోకవరం ఎస్సై పవన్‌కుమార్ సూచించారు. గోకవరం దేవీచౌక్ సెంటర్‌లో శనివారం సిబ్బందితో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ వినియోగం వలన ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుతున్న వారికి హెల్మెట్ కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌ను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేసి నిరసన తెలిపారు. దీక్ష శిబిరాన్ని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి కేఎస్‌పీ రావు సందర్శించి సంఘీభావం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి కొత్తూరు సెంటర్‌లో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించారు. వేద పండితులు ఉదయం 8.32 గంటలకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నీటి ఎద్దడి.. రైతు కంటతడి

- ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అర్తమూరు కాలువకు గండి
- దిగువకు వృథాగా పోతున్న నీరు
- అధిక ఉష్ణోగ్రతలతో ఎండిపోతున్న శివారు పొలాలు
- సొంతఖర్చుతో గండికి మరమ్మతులు చేయించుకున్న అన్నదాతలు



ప్రొక్లెయిన్‌తో గండి పూడ్చివేత పనులు



దగ్గరుండి గండిని పూడ్చిస్తున్న రైతులు

కోటనందూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాండవ నదిలో దిగువాయి గ్రోయిన్ కింద ఉన్న అర్తమూరు కాలువకు గండి పడింది. ఫలితంగా ఆయకట్టుకు అందాల్సిన సాగునీరు వృథాగా దిగువకు పోతోంది. గతవారం రోజులుగా వేసవిని తలపించిలా కాస్తున్న ఎండలకు అర్తమూరు కాలువ పరిధిలో రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి ఎన్నో వ్యయప్రయాసలతో సాగు చేసిన వరిపంట ఎండిపోతోంది. కళ్లముందే పైరు ఎండిపోతుండడంతో తట్టుకోలేని రైతన్నలు పాలకులు, అధికారులను ఆశ్రయించారు. సమస్యకు పరిష్కారం దొరకకపోవడంతో చేయి చేయి కలిపి అడుగు ముందుకేశారు. తలోకొంత మొత్తం చొప్పున రూ.2 లక్షల వరకూ పోగు చేసి గండి పూడ్చివేతకు చర్యలు చేపట్టారు. ఫలాలు చేతికందే సమయంలో పంట ఎండిపోతున్న తరుణంలో మరో గత్యంతరం లేకే సొంత ఖర్చులతో గ్రోయిన్‌కు మరమ్మతులు చేయించుకుంటున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు రైతుల కష్టాలను గుర్తించి తాండవనదిలో ఉన్న గ్రోయిన్లకు శాశ్వత మరమ్మత్తులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

1000 ఎకరాల్లో సాగు

దిగువాయి గ్రోయిన్ పరిధిలో ఉన్న అర్తమూరు కాలువ కింద కోటనందూరు, అర్తమూరు, జగన్నాథపురం, ఇండుగపల్లి, బొద్దవరం, టీజే నగరం, తుని మండలం డి.పోలవరం గ్రామాల్లో వెయ్యి ఎకరాలకు పైబడి ఆయకట్టు ఉంది. ఎకరాలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకూ పెట్టుబడి పెట్టి సాగు చేశారు. ఇప్పటివరకూ పరిస్థితులు సాగుకు అనుకూలంగానే ఉన్నప్పటికీ ప్రస్తుతం సాగునీటి సమస్య తలెత్తింది. ప్రస్తుతం పాలుపోసుకునే దశలో ఉన్న వరిపంటకు సాగునీరు సమృద్ధిగా అందకపోతే పంట నాశనమయ్యే ప్రమాదంలో కొట్టుమిట్టాడుతోంది.

శిథిలావస్థలో గ్రోయిన్లు

తాండవనదిలో వృథాగా పోయే నీటిని మళ్లించి సాగునీటిగా పొలాలకు అందించేందుకు తాండవనదిలో అల్లిపూడి, కొట్టాం, కోటనందూరు, కామినీడు, దిగువాయి గ్రోయిన్లను నిర్మించారు. ఈ గ్రోయిన్ల ద్వారా సుమారుగా 5 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాగా ఈ ఐదు గ్రోయిన్లు గత రెండు దశాబ్దాలుగా శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతున్నాయి. అధికారులు ఏటా కంటితుడుపు చర్యగా మరమ్మతులు చేస్తున్నారు. ఫలితంగా ఆయకట్టు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఈ కాలువే ఆధారం



నా పొలంలో పంట పండాలంటే ఈ కాలువే ఆధారం. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. నీరు లేక పంట కళ్లముందే ఎండిపోతోంది. ఏ చేయాలో పాలుపోని పరిస్థితి. ఈ కాలువ కింద ఉన్న వారంతా ఎకరా, రెండెకరాల రైతులమే. పంటను పాడు చేయలేక ఆర్థికంగా ఇబ్బందులతో గండి పూడ్చుకుంటున్నాం.

– గొర్లి స్వామినాయుడు, రైతు, జగన్నాథపురం

గ్రోయిన్లకు శాశ్వత మరమ్మతులు చేయాలి



ఏటా గ్రోయిన్ల కింద రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ఈ గ్రోయిన్లను పట్టించుకోవడం లేదు. రైతులకు పంటసాగు కన్నా గ్రోయిన్ల మరమ్మత్తులే పెద్ద తలనొప్పిగా మారాయి. అధికారులు స్పందించి గ్రోయిన్లకు శాశ్వత మరమ్మతులు చేయాలి.

– మళ్ల సత్యనారాయణ, రైతు, కోటనందూరు

పిల్లర్ నిర్మాణంతోనే సమస్య




తాండవనదిపై నిర్మిస్తున్న బ్రిడ్జికి సంబంధించి పిల్లర్ ఏర్పాటుకు నదిని భారీగా తవ్వడం వల్లే అర్తమూరు కాలువకు గండి పడింది. ఇక్కడ వరదనీటి ప్రవాహం పెరిగిపోవడంతో కాలుకు గండి పడింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే తప్ప గండి సమస్యకు పరిష్కారం దొరకదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మళ్ల అప్పలనాయుడు, రైతు, కోటనందూరు

ప్రజా సమస్యలను గాలికొదిలి డైవర్షన్ రాజకీయాలు

మాజీ మంత్రి కురసాల కన్నబాబు



కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగం, ఇసుక వంటి ఎన్నో ప్రధాన సమస్యలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం గాలికి వదిలేసి లడ్డూ పేరుతో తప్పుడు ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పనిచేయాలన్నారు. ప్రతిపక్షమైన వైఎస్సార్ సీపీ ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతూ ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత వరుపుల సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మండల అధ్యక్షుడు రామిశెట్టి బులిరామకృష్ణ, కొప్పన శ్రీను, మర్రి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



లింగంపర్తిలో మహిళలకు పెన్నులు, పుస్తకాలు అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ

ఏలేశ్వరం: గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రత్తిపాడు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ అన్నారు. మండలంలోని లింగంపర్తిలో శనివారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ మహిళలకు చట్టప్రకారం రాజ్యాంగం కల్పించిన హక్కులను కల్పిస్తున్నట్టు తెలిపారు. మెరుగైన సమాజ నిర్మాణానికి గ్రామీణ మహిళలు ముందుకు రావాలన్నారు. అనంతరం మహిళలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి, న్యాయవాదులు బుగతా శివ, అవసరాల దేవి, సర్పంచ్ యార్లగడ్డ చంద్రలేఖ, ఎస్సై రామలింగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రత్తిపాడు: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక మినర్వా విద్యా సంస్థల ఆవరణలో శనివారం వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే సత్యప్రభ బహుమతులు అందజేశారు. మినర్వా విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డీవీఎస్ రమేష్ రాజు, అటవీశాఖ ఏలేశ్వరం రేంజ్ ఆఫీసర్ కె.దుర్గాప్రసాద్, డీఆర్వో జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

సుంకర తమ్మారావుకు ఘన నివాళులు



తమ్మారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు తదితరులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) మాజీ చైర్మన్ సుంకర తమ్మారావు (86) ఇటీవల మృతి చెందారు. అతని స్వగ్రామం ఒమ్మంగిలో శనివారం సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తమ్మారావు సొసైటీ చైర్మన్‌గా, గ్రామ సర్పంచ్‌గా, ద్వారకా తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడిగా తమ్మారావు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. మృతుడి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు తనయుడు సూరిబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మండల అధ్యక్షుడు రామిశెట్టి బులిరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, సుంకర గంగాధర్ రామారావు, రామిశెట్టి మురళి తదితరులు ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓలు

గండేపల్లి: మండల ఎంపీడీఓగా నాతి బుజ్జి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆత్రేయపురం ఎంపీడీఓగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన రామన్ ఆత్రేయపురం బదిలీపై వెళ్లారు. నూతన ఎంపీడీఓకు ఏఓ చంద్రరావు, ఏపీఓ గంగా భవాని, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గంపేట ఎంపీడీఓగా చంద్రశేఖర్

జగ్గంపేట ఎంపీడీఓ ఏవీఎస్ చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ రూరల్‌లో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా జగ్గంపేట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

శంఖవరం ఎంపీడీఓగా శర్మ

శంఖవరం: స్థానిక ఎంపీడీఓగా ఎస్ఎస్ శర్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కోటనందూరు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన జి.శివరామకృష్ణ రౌతులపూడి మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఎస్ శర్మకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కిర్లంపూడి ఎంపీడీఓగా హరికృష్ణ

కిర్లంపూడి: స్థానిక ఎంపీడీఓగా బి.హరికృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రంపచోడవరం ఎంపీడీఓగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సారాతో మహిళ అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగిలో సారాతో మహిళను అరెస్టు చేసినట్టు శనివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఒమ్మంగిలో సారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి నార్లంక వరలక్ష్మిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె నుంచి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆమెను స్థానిక కోర్టులో హాజరు పరచి, రిమాండ్‌కు తరలించారు.

రెండు కౌంటర్ల ఏర్పాటు

నూతన మద్యం పాలసీ మేరకు ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్‌లో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈ కౌంటర్లు ద్వారా నూతన మద్యం షాపుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. దరఖాస్తుల స్వీకరణకు ఆదివారం కూడా కౌంటర్లు తెరిచే ఉంటాయని తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గండేపల్లి: మండలంలోని మురారిలో హిమజ శ్రీవాణి స్కూల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఏఎస్సై చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గండేపల్లి, మురారి, రాజానగరం మండలం సీతారామపురం తదితర గ్రామాల నుంచి వచ్చిన రోగులకు గౌతమి నేత్రాలయం వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందజేసినట్టు ప్రిన్సిపాల్ టి.కుబేర్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఉదయం ఉక్కబోత.. సాయంత్రం కుండపోత



తుని పట్టణంలో కురుస్తున్న వర్షం

తుని: గ్లోబల్ వార్మింగ్ కారణంగా వాతావరణ సమతుల్యతకు విఘాతం కలుగుతోంది. అకాలంగా కురిసే భారీ వర్షాలు, వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలు ప్రజలను భయపెడుతున్నాయి. వేసవిలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు సర్వ సాధారణం. ఇందుకు భిన్నంగా గడిచిన వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. గరిష్టంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కాగా శనివారం ఉదయం 10 గంటలకే భానుడు తన ప్రతాపం చూపాడు. మధ్యాహ్నం 3 గంటలకు వరకూ ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. ఉష్ణతాపంతో విలవిలల్లాడిన ప్రజలు వర్షానికి సేదతీరారు.

కనకదుర్గమ్మకు 108 రకాల పిండి వంటలతో నైవేద్యం



వీరభద్రునిగద్దెలో కనకదుర్గమ్మకు నివేదించిన 108 రకాల పిండి వంటలు

గోకవరం: స్థానిక వీరభద్రునిగద్దెలో కొలువైన కనకదుర్గాదేవికి శనివారం 108 రకాలతో పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, భక్తుల సహకారంతో సిద్ధం చేసిన పిండి వంటలను రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం నివేదించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

ఏలేశ్వరం: దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో అమ్మవారికి శనివారం సారె సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుర్గాదేవి అమ్మవారికి చీర, సారె అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, మహిళలు పాల్గొన్నారు.


మహిళల భద్రతకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు

కోటనందూరు: మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు అన్నారు. మండలంలోని కేఓ అగ్రహారంలో శనివారం రాత్రి మహిళల భద్రత, దొంగతనాలు, జూదం తదితర విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ మహిళల భద్రతపై నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. మహిళలు, ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలలు తప్పవని హెచ్చరించారు. దొంగతనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జూదం, సారా తయారీ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై టీ రామకృష్ణ పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి నమోస్తుతే..



రత్నగిరిపై అన్నపూర్ణాదేవి అలంకారంలో వనదుర్గమ్మ



అన్నపూర్ణాదేవి అలంకరణలో లోవ తలుపులమ్మ అమ్మవారు



గోకవరంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో కనకదుర్గమ్మ



కాకరాపల్లిలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

తుని రూరల్/ఏలేశ్వరం/కోటనందూరు/కిర్లంపూడి/తొండంగి/ప్రత్తిపాడు రూరల్/అన్నవరం: దసరా మహోత్సవాలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం జగన్మాత దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ మాలధారులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు..

రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రుల్లో భాగంగా మూడోరోజు శనివారం రత్నగిరి దుర్గామాతలను అన్నార్తుల ఆకలి తీర్చే అన్నపూర్ణగా అలంకరించి పూజించారు. ఒక చేతిలో అక్షయపాత్ర, మరో చేతిలో గరిటతో వనదుర్గమ్మ, కనకదుర్గ అమ్మవార్లు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు ఉదయం అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

గాయత్రీదేవి అలంకరణలో నేరేళ్లమ్మ

తొండంగి మండలంలోని గోపాలపట్నం గ్రామదేవత నేరేళ్లమ్మ అమ్మవారు శనివారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా సందర్భంగా గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ తెలిపారు.

గోకవరంలో పడిపూజ

గోకవరం దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ శనివారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పడిపూజను ఘనంగా నిర్వహించారు. మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాలకు చెందిన సుమారు మూడు వేల మంది భవానీ భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు.

భవానీ భక్తులకు మజ్జిగ, పండ్లు పంపిణీ

విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి కాలినడకన వెళ్తున్న పలువురు భవానీ భక్తులకు శనివారం దాతలు మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ గేట్ వద్ద యడాలి రాంబాబు, బొద్దపాటి లింగబాబు తన సొంత ఖర్చులతో పండ్లు, మజ్జిగ పంపిణీ చేయడంతో భవానీ భక్తులు హర్షం వ్యక్తం చేశారు.